# డిగ్రీ పరమార్థం

"ఎక్కలి కెల్తున్నావ్ నాన్నా....?"

ముక్కుపచ్చలారని మూడేళ్ళ పసిది అడిగింది అరిందలా.

"గుడికి తల్లీ!"

"ఏ గులికి?" వివరాలు గూడా విడిచిపెట్టలేను.

"కిట్టన్న గుడికి.... అదే! శ్రీకృష్ణ జన్మస్థానానికమ్మా!"

జైలుకు వెళ్తూ సూర్యం – జానకి మొహంలోకి చూస్తూ పసిదానికి జవాబిచ్చాడు... నిర్లిప్తంగా.

తల్లీదండుల్ని అటొకసారి ఇటొకసారి చూచి.... నవ్వాలో ఏడ్వాలో తెలీని ఫోజుపెట్టిందా బుల్లి ఆకారం.

భర్తనూ.... అతని చేతులకు బేడీలు తగిలించిన కానిస్టేబుల్‌నూ.... సబిన్స్పెక్టర్నూ మొద్దుబారి చూస్తూంది జానకి. పొంగిపొరుతున్న కన్నీళ్ళను లక్ష్యపెట్టే పరిస్థితిలోలేదు.

"మోటర్ పేచఢావో.... మాఁకే...." సబిన్స్పెక్టర్ ఆజ్ఞల్ని అమలు పరిచారు రక్షక భటులు.

పరిసరాలు వెక్కిరిస్తున్నాయి జానకిని. సంగతేమిటని ప్రశ్నిస్తున్నాయి.

పక్కనున్న సన్నకారు హోటల్ రేడియో తనగోడు తాను వినిపిస్తుంది...

"అబలా జీవన్ హాయ్ తమ్‌హారీ

అంచల్‌మే హై దూద్ జార్ ఆంఖోఁమేపానీ...."

మైథిలీ శరణ్ గుప్తాగారి యశోధర కావ్యగానం.

పుట్టడమే – బ్రతుకలేని ప్రైమరీబడిపంతులు కొడుగ్గా పుట్టాడు సూర్యం. బడిపంతులు కుటుంబం మధ్యరకందైనా అతని బాల్యంలో ఏలోటూ రాలేదు.

తండ్రి విశ్వనాథం బడిపంతులు ఉద్యోగం చేస్తూనే రెండెకరాల మాగాణి కొనగలిగాడు. ఉన్నది ఊడకుండా, లేనిది ఆశించకుండా ఒకే ఒక్క కొడుకు సూర్యంకూ భార్య కాంతమ్మకూ ఏలోటూ కలక్కుండా రోజుల్ని నెట్టుకొచ్చారా రోజుల్లో.

సూర్యం ప్రైమరీ చదువు గట్టెక్కగానే మాయదారి రోగం పట్టుకుంది విశ్వనాథంగారిని...సంపాదించిన రెండెకరాల మాగాణిసి, నిలువ ఉంచుకున్న సొమ్ముల్తో-ఆయన్ను గూడా ఎగరేసుకు పోయింది. పుట్టింది దిక్కులేని కాంతమ్మ కష్టపడుగాని అర్థంగాలేదు కష్టమంటే ఏమిటనేది.

తండ్రి ప్రావిడెంట్‌ఫండ్, ఇన్సూరెన్సు డబ్బుల్తో సూర్యం హైస్కూల్ చదువు నిజమైన కష్టాల్ని రుచిచూడకుండానే సాగిపోయింది. తల్లి కాయకష్టం చేసి సంపాదించడం కళ్ళారాచూచి-బాధపడ్డా ఊరుకునేవాడు.

"స్కూల్ ఫైనల్ పాసయ్యానమ్మా" అనగానే ఎంతో సంబురపడి పోయింది కాంతమ్మ.

''మీనాన్నే ఉంటే ఎంత సంతోషించేవారో........!" కంట తడిబెట్టింది.

''ఏదన్నా ఉద్యోగంచేసి నాకష్టాలు గట్టెక్కిస్తావా?'' తల్లి దీన వదనం-అతన్ని తట్టిలేపింది.

"సరేనమ్మా.... ఉద్యోగాల వేటలో పడతా'' నని భరోసా ఇచ్చాడు........ తానో అశ్వమేథయాగం చెయ్యబోతు న్నంత ధీమాతో.

పేపర్లో ఒక మెట్రిక్‌లేట్ కావాలనే వాంటెండ్ కాలంను పదిమంది చదివి.... అప్లైచేసినా రిప్లైరాదని గూడా తెలిసి వెయ్యిమంది దర ఖాస్తులు చేసే ఈరోజుల్లో తిరగరాని చోటల్లా తిరిగాడు ఉద్యోగం కోసం. డబ్బు ఖర్చైందని పశ్చాత్తాపడ్డం తప్ప ఫలితం శూన్య మైంది. ప్రస్తుతానికా ప్రయత్నం మానుకోవడమే నయమన్పిం చింది కాంతమ్మ గ్గూడా.

చేతులు తడిపి ఉద్యోగం సంపాదించి పెట్టలేని తన నిస్స హాయితకు వెక్కివెక్కి ఏడ్చింది.

''మరేం చేస్తావురా....?'' ఆలోచనలో మునిగి తేలుతున్న సూర్యాన్ని ప్రశ్నించింది.

''కనీసం డిగ్రీసంపాదించందే ఉద్యోగం దొరకడం దుర్ల భమమ్మా.... నేను బియ్యేవరకన్నా చదవాలి....'' అన్నాడొక నిర్ణయానికొచ్చిన వాడిలా.

"కాని...కాని డబ్బో... డబ్బో...." శూన్యంలోకి చూచింది కాంతమ్మ నిరాశగా.

"మా తాత సంపాదించిన ఇల్లును తాకట్టు పెట్టడం మినహా మరే మార్గమూ కన్పించడం లేదమ్మా" అన్నాడు బాధపడ్తూనే.

వెనకా ముందాడిన కాంతమ్మ-ఒప్పుకోక తప్పలేదు కొడుకు భవిష్యత్తు కొరకు-తన అనారోగ్యాన్ని గూడా లేక్కచేయక.

"అప్పుడైతే ఉద్యోగం తప్పకుండా దొరికి తీరుతుం"దని నిట్టూర్చింది.

దేశభక్తి మూర్తీభవించి, బంగ్లాదేశ్ విముక్తి పోరాటంలో మరణించిన సైనికుని కూతురు జానకిని కట్నం లేకుండా పెళ్ళాడ్డం, తండ్రికావడం... డిగ్రీ పూర్తికావడం...... కాలచక్రం గిర గిరల్లో జరిగిపోయింది.

తిరిగి కొత్త ఆశల్తో ఉద్యోగాన్వేషణలో పడ్డాడు.

కొడుక్కు ఉద్యోగం దొరికి తీరుతుందని ఉక్కిరి బిక్కిరై పోతున్న కాంతమ్మను చూచి తనలో తానే నవ్వుకున్నాడు సూర్యం.... నిర్వేదంగా

డిగ్రీకాయితం, సత్ప్రవర్తన సర్టిఫికేట్, వివిధ రంగాల్లో సాధించిన విజయాలకు చిహ్నంగా చేతికొచ్చిన సర్టిఫికేట్లన్నం టినొక ఫైల్లో బంధించి.... ఫైలును చంకలిరికించుకుని ఆఫీసులు, ఎన్నో ఫ్యాక్టరీల మెట్లెక్కిదిగాడు. కనిపించిన వాంటెడ్‌కాలం కల్లా దరఖాస్తు పంపించాడు తాను మెట్రిక్ పాసైనప్పుడు మెట్రి క్కున్న విలువ ఇప్పుడు డిగ్రీకి కూడా లేక పోయింది. కో అంటే కోటి అన్నట్టు అంటెండర్ పోస్టులగ్గూడా డిగ్రీహోల్డర్లు అప్లైచేసి

పోటీలు పడుతూంటే.... డబ్బు కరిగి పోయింది-బోలెడంత అను భవమొచ్చింది. ఉద్యోగమొక మేరు పర్వత మన్పించింది. ఐనా తిరిగాడు.

కొన్ని ఫ్యాక్టరీల్లో ఆఫీసుల్లో కంప్యూటర్లు బిగించడంతో ఉన్నవారికే రిట్రెంచ్ మెంటులొస్తున్నాయని విన్నాడు.

ఆ రోజు...........

తిరిగి తిరిగి ఇంటికి చేరగానే తల్లి మంచమ్మీదుంది-మూలుగుతూ. ఖనేల్ ఖనేల్ మని దగ్గడం వినిపించి,భయమేసింది. ఆకారం భయంకరంగా కన్పించింది. వెంటనే ప్రభుత్వాసుపత్రికి చేర్పించాడు. ఔటు పేషంట్. కాబట్టి ఆరుగంటలు పడిగాపులుగాచి రెండు మాత్రల్తో తిరిగి రావాల్సొచ్చింది. అది మామూలు మా తర్రలకు లొంగే వ్యాధి కాదని తెలిసి గూడా అంతకంటే ఇంకేమీ ఇచ్చేందుకు డాక్టరుకు చేతులాడ లేదు.

ఇంటికొచ్చింతర్వాత అలాగే దగ్గింది మూన్నాల్గు గంటలు. ధైర్యంచేసి మళ్ళీ తీసికెళ్ళాడు పర్రభుత్వాసుపతి్రకే.

డాక్టర్ ఆసుపత్రిలో లేడు. వెనకనే.... పర్రభుత్వం ఆయన కలాట్ చేసిన బంగళాలో ప్రైవేట్ పార్రక్టీసులో మునిగి తేల్తున్నాడు.

కాంపౌడర్ను బతిమాలి డాక్టర్ చాంబర్లోకెళ్ళాడు తల్లిని పట్టుకుని, జానకి, పాప బయటనే ఉండిపోయారు.

"ఏం మళ్ళీ వచ్చావ్?...." అన్నాడు డాక్టర్ నిర్లక్ష్యంగా. ఎంతైనా డాక్టరుగదా.... అనుకున్నాడు సూర్యం.

"అమ్మకు.... దగ్గు ఎక్కువైంది డాక్టర్........నాకెందుకో భయమేస్తుంది డాక్టర్.... ప్లీజ్.... మరోసారి పరీక్షించి మందు

లివ్వండి సార్!.'' బతిమాలాడు ఆందోళనగా.

''ముందు ఫీజివ్వు... ఐదు రూపాయలు. పరీక్షచేసి మందులు రాసిస్తా......'' అన్నాడు కనికరించినట్టు.

జేబులో ఉన్నవి ఐదే రూపాయలు. తకీమనిడాక్టర్ చేతిలో పెట్టాడు. స్టెతస్కోపు కదిలింది. పరీక్ష మంచమ్మీద పడుకోబెట్టు మని సైగచేసాడు.

ఏవేవో పరీక్షలు చేసి

''చాలా మించుకు పోయింతర్వాత తెచ్చావే....'' అంటూ రింగ్‌కుర్చీలో కూర్చున్నాడు.

బరబరా కాయితం నిండా మందులు రాసి సూర్యం చేతి కందించాడు.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు సూర్యంకు....అన్ని పరీక్షలు చేసిన డాక్టర్ ఒక్క ఇంజక్షనో మాత్రినో ఇస్తాడనుకుంటే నిరాశ ఎదురైంది. కాంతమ్మ దగ్గుతూనే వుంది. జేబులు ఖాళీ. ఇంట్లో ఒక్కపైసాగూడాలేదు. జానకి మంగళసూత్రం అప్లికేషన్లకు, ఇంటర్వ్యూలకు కరిగిపోయింది. చేబదుళ్ళు శక్తికి మించాయి. ఇల్లుమీది అప్పు వడ్డీతో రెట్టింపైంది. వెంటనే డబ్బులు కట్టుమని- లేదా కోర్టుకెల్తానని... మార్వాడి వార్నింగిచ్చేసాడు.

"నా దగ్గర చిల్లిగవ్వగూడా లేద్సార్.... దయచేసి హాస్పి టల్లో ఉంటే ఇప్పించండి సార్........ మీకు దండంబెడతాను" చేతులు జోడించాడు సూర్యం ఆవేదనతో.

డాక్టర్ మొహం వివర్ణమైంది. ఈసడింపుగా చూచాడు,

"మీ ఋణమెలాగైనా తీర్చుకుంటాను........ కాదనకండి డాక్టర్..." డాక్టర్ పాదలను తాకాయి చేతులు. గ్యాద్యుయేటు నన్నభావం కన్నీరు నాపలేదు.

కాంపౌండర్ను పిలిచి "బయిటికి పంపించు వీళ్ళను" అన్నాడు డాక్టర్ పక్కకు జరిగి.

పాపను, ముసలి తల్లిని, జానకిని అక్కడే వదిలేసి ఊరంతా తిరిగాడు అప్పుకోసం. అడగరాని వారిని గూడా అడిగి లేదనిపించుకున్నాడు.

మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఇల్లును తాకట్టు పెట్టిన మార్వాడీ దగ్గరికెళ్ళి.... ఇల్లునతనికే అమ్మేస్తానన్నాడు లెక్కలు చేసి వందరూపాయల కాయితం చేతిలో పెట్టి సంతకాలు చేయించుకున్నాడు మార్వాడి.

మందులు కొనుక్కొని పరుగెత్తుకొచ్చాడు ఆసుపత్రికి. బయిటి వరండాలో తల్లి పడుకోబెట్టివుంది. జానకి బిగ్గరగా ఏడుస్తుంది... కదలలేని తల్లిని చూచి గుండెలు బాదుకున్నాడు. శవంగా మారిన తల్లి మీద పడి బోరుబోరున ఏడ్చేశాడు.

అగలేని దుఃఖం కోపంగా మారి కట్టలు తెంచుంది.

"ఇంతపెద్ద టౌన్లో.... అంతపెద్ద డాక్టర్ ముందే చచ్చింది పాపం!" వాపోయారు చూస్తున్నవారు.

"మీరు బయటి కెళ్ళగానే దగ్గు ఎక్కువైంది సార్! ఆ తర్వాత ప్రాణం విడిచింది. డాక్టర్ బయిటికి తీసుకెళ్ళమన్నాడు... నేనుగూడా సాయం పట్టాన్సార్...." కాంపౌండర్ చెప్పి వెళ్ళిపోయాడు ఇంటికి. పేషంట్సు ఎవరూ లేరు.

జనాలు గూడా ఎవరూ లేరు,

" ........కనీసం ప్రాణం పోయే ముందన్నా........చిన్న ప్రయత్నం...... కాదు మానవ ప్రయత్నంగా ఒక ఇంజక్షన్ గూడా ఇవ్వలేదు డాక్టర్........ " గోడుగోడు మంది జానకి.

సూర్యం ఆవేశం అధికమైంది.

డాక్టర్ దగ్గరి కెళ్ళాడు.

''ఏమిటీ అన్యాయు''మని నిలదీసాడు.

"పుణ్యానికి దొరుకుతాయా మందులు?'' ఎదురు ప్రశ్న వేసాడు డాక్టర్.

"ప్రభుత్వాసుపత్రి మందులు........ పుణ్యానికి కాకపోతే డబ్బులకిస్తారా...?"

"అవి అంత తేరగా వచ్చాయను కున్నావా?"

"ఔను........ గవర్నమెంటిచ్చిన మందులు ప్రైవేట్ పేషంట్సు కమ్ముకోవాలి కదూ....! లక్షల రూపాయల ప్రజా ధనం ఖర్చైతేనే - నువ్వుడాక్టరువయావన్న సంగతి మరిచావా? ఆ లక్షల్లో కొంతనైనా ప్రజలకు ఇవ్వాల్సింది మరిచిపోయి.... కనీసం.... నేను వచ్చేవరకన్నా నా తల్లిని బ్రతికించేందుకేమన్నా ఇవ్వలేక పోయావు." సూర్యం ముక్కుపుటాల్లో వేడిచోటుచేసుకుంది. ఎగిరి పడుతున్నాయవి. డాక్టర్‌కు కోపమొచ్చింది.

ముచ్చెమటల్ని తుడుచుకుంటూ........

"మిస్టర్.... మాటలు కాస్త మర్యాదగా రానీ... నా వృత్తి గురించి నీకేందెల్సు... నీ బాబుగారి డబ్బుతో చదివానా నేను?

నాన్సెన్స్....గెటౌట్...." అరిచాడు.

అగ్నిలో ఆజ్యం పడింది. సూర్యం గుండెల్లో సూర్య గోళం బద్దలైంది.

"ఛిఛీ...... నీలాంటి వెధవలు బ్రతికుంటే పవిత్రమైన నీవృత్తికీ... దేశానికీ అవమానం......."

డాక్టర్ గల్లా సూర్యం చేతిలోకొచ్చింది.

డాక్టర్ రెండు చేతులు సూర్యం చెంపలు మీద నాట్యం చేసినాయి.

డాక్టర్ మెడగట్టిగా పట్టేసాడు సూర్యం. విడిపించుకునే ప్రయత్నంలో పడిపోయాడు డాక్టర్-కాని సూర్యం పట్టు సడల లేదు. సూర్యం భుజాలు పట్టి వెనెక్కి లాగబోయింది జానకి. విఫలమై వెనక్కిపడి పోయింది.

ఫాషనకై పెంచుకున్న సూర్యం ఎడమ చేయి పెద్దవేలు గోరు.... ఉద్యోగం దొరికితే ఏడుకొండల వాడికి కానుకగా వెళ్ళా ల్సిన గోరు-డాక్టర్ గొంతులో దిగబండింది. రక్తం చిమ్మి సూర్యం మొహం మీద నిండింది. డాక్టర్ శవమయ్యే దాకా వదలలేదు సూర్యం.

తల్లి శవానికి అంత్య క్రియలుచేసిం తర్వాత గాని తెలీలేదు తానుచేసిన పనేమిటో - దాని పర్యవసాన మేమిటో.......

వాన్ పోలీస్ స్టేషన్ ముందాగింది.

కానిస్టేబుళ్ల బూట్ల టకటకల్తో బయిటి ప్రపంచాని కొచ్చిన సూర్యం కళ్ళెత్తి చూచూడు బయిటికి

"నాలాంటి వారి జీవిత పరమార్థమింతే కాబో"అనుకుని నిట్టూర్చాడు.

"నేను చదివింధి డిగ్రీయే .... ఆ సబిన్స్పెక్టర్ చదివిందీ డిగ్రీయే .... కాని ఇద్దరి జీవితాల్లో ఎంత మార్పు ... ప్చ్....?" పెదవి విరిచాడు.

"ఉతార్ దో సాలేకూ ...." గద్దించాడు సబిన్స్పెక్టర్.

( ప్రజామత 11-6-1972 )

